# తెల్లజరీచీర

కాంతం పెళ్ళయి రెండేళ్ళు తిరిగాయి. గురునాధానికి కాపరం పెట్టాలనివున్నా తల్లితో చెప్పేందుకు ధైర్యంచాలక ప్రతిసారి ఆరంభించిన వాక్యం మొదట్లోనే నిల్చిపోయేది. వేసంగిసెలవలు గడిచినట్టేలేవు. అంత తొందరగా దొర్లిపోతోంది కాలం ఆసారి జ్యేష్టంలోనే నల్లమేఘాలు వూరిపైకి దండెత్తాయి. పెద్దలు పెదిమ విరిచారు. కార్తికి ఎదురుపడితే వాన, పంటలు తిన్నట్టేనని.

కచ్చేరి సావిట్లో తండ్రి డబ్బు లెఖ్ఖలు చూసుకుంటూ గురునాధాన్ని పిల్చాడు. “అబ్బీ! ప్రయాణం ఎప్పుడురా?” తండ్రి తన్ని అంత మంచిగా సంప్రదించటం అదే మొదలేమో. తను ఎంతో పెరిగినట్లు తట్టింది తల్లిదగ్గరలేని చొరవ తొంగిచూసింది. కాంతాన్నికూడా తీసుకెడతా. మాట పూర్తిచేసి మొహం తుడుచుకున్నాడు. తండ్రి ఎదట నిలవకుండా మండువాలోకి వెళ్ళాడు. కాంతం తెల్లజరీ చీర జీర్ఘాడే టట్టు కట్టుకుంది. వయ్యారంగా గడపపొదిగిట నిల్చుని తెల్లటి కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యంగా చూస్తోంది.

తల్లి సందడి వినపడలేదు. కాంతం కొంగుని చేతిని చుట్టుకు వెనక్కిలాగాడు గురునాథం. వోణీ చుట్టుకుంటూన్న చిటెక్క తొంగిచూసి నోరు నొక్కుకుంటూ ‘హవ్వ అందేం పనిరా అన్నా! చీర నలగదూ! కొత్తదికూడా’ అంటూ ఆశ్చర్యంగా కేక పెట్టింది. పక్కగదిలోకి తప్పుకున్నాడు.

మొదట ఇష్టపడకపోయినా కాంతంచేత కొత్తకాపరం పెట్టించే నెపంతో చిట్టెక్క, చంద్రమ్మగారు ప్రయాణం కట్టారు.

గురునాధం తీసుకున్న ఇల్లు డాబా, చిన్నతోట, కటకటాలు, పెరట్లో నుయ్యి - వున్నంతలో ఇమిడిగ్గానేవుంది అని తల్లి మురిసింది. ఆసారి జీతం తల్లి చేతిలో పెట్టాడు గురునాధం. చంద్రమ్మగారికి డబ్బు చూడగానే జీవితంలో మొదటిసారి వెల్తుర్ని చూసినంత ఆనందమైంది. చిట్టెక్కని తీసుకు పక్కింటి బామ్మగారితో మాట కలుపుకు వూరుచుట్టి, దీపాలవేళకి వంటింటిసామాన్లు ఇంటెడు తెచ్చింది. కొట్లో బాకీపెట్టివచ్చా మరో వందకావాలంటూ మెట్లమీంచే కేకపెట్టింది. కాంతం నెమ్మదిగా పంపవొచ్చుగా అని యాదాలాపంగా ఇచ్చిన జవాబుకి చంద్రమ్మగారి కంఠం తారాపధాన్ని చేరింది. నీ పుట్టింటి నించి తెచ్చిన సొమ్మేంకాదులే. మధ్యనీ పెత్తనమేమిటంట? వాక్యం పూర్తికాకుండానే కాంతం కళ్ళు నీళ్ళతో నిండి, వత్తుకుంటూ మంచంపైన వాలింది.

చిట్టెక్క గదిలోకి చూసింది. అన్నగారు కాంతాన్ని వోదార్చటం చిన్నకళ్ళతో వోరగా చూసింది. మెల్లగా తల్లి దగ్గరకు వెళ్ళింది.

నీ కెందుకే వాళ్ళ వాళ్ళ గొడవఅంటే వూరుకోవాయె. ఆవిడగారు మంచమెక్కి సొకాలెడుతోంది. మనవాడేం మంచి వాడు కనుకనా; ఆవిడకి తాళం వేస్తాడాయె' అంటూ తల్లికి పౌరుషంలాంటి పాఠం బోధించింది.

చంద్రమ్మగారు వడ్డూ పొడుగూవున్న మనిషి. మంచి వాక్కుశుద్ధి వుంది. ఎవరికి తగ్గట్టు వాళ్ళకి చెప్పగల సమయ స్ఫూర్తి చిన్నప్పుడే జీర్ణమైన శరీరం. ఆకారంలోని ఆలోచనలు సౌమ్యంగా కనబడేందుకో ఏమొ భగవంతుడు పసిడి రంగు ఇచ్చాడు. కావ్యాల్లో వర్ణనలు కొన్ని ఆవిడకి సరిపోయినా ఆ చిన్నకళ్ళే ఎబ్బెట్టుగా కనబడతాయి. నోరు పెద్దదే కాని ఆవిడ వో రకం అందమైన నవ్వుని అభ్యాసంచేసింది. కంఠంలో కాఠిన్యంవున్నా అన్ని స్వరాల్ని పలికిస్తుంది. అబ్బీ అన్న మాట అంతకంటే ప్రేమగా మరెవరూ పలకలేరు.

కాంతంతో నిత్యం చిన్న చిన్న యుద్ధాలు, వాదనే అనుకోండి, మరో చిన్న ఘర్షణే అనుకోండి నిత్యం ఆనవాయితీగా జరుగుతోంది. తీరికసమయాల్లో కాంతం కంటినీటితో దిండువరనో లేక తీరిగ్గావుంటే గురునాధం చొక్కానో తడిపి కళ్ళు వాచాక కళ్ళు కడుక్కు కాటికెట్టుకోవడానికి కాంతం కళ్ళు అలవాటు పడ్డాయి. అసలే పెద్దకళ్ళు వాచి గవ్వల్లా కనపడేవి. నలుపులో చేరిన ఛాయ కళ్ళచుట్టూ మరీ నల్లబడి వడిలినట్టువున్న కళ్ళని చూడాలంటే గురునాధానికి కడుపులో తిప్పినట్టు అవుతుంది.

ఏడవకుండా వుండలేవా? అని కాంతాన్ని ప్రాదేయ పడ్డప్పటినుంచీ వోపిసరు ఎక్కువైందే కాని తగ్గినట్టు కనపడలేదు. తడితరిగినకళ్ళు వుబ్బిన రెప్పలమధ్య గువ్వల్లానిల్చాయి.

గురునాధం ఇల్లు విడిచి వెళ్ళేదాకా కాంతం ఆ గదిలోనే అటూ ఇటూ తచ్చాడుతూ గడుపుతుంది. మధ్యమధ్య ఆడబడుచు చిట్టెక్క తొంగిచూసి పరామర్శించినా లెక్క చెయ్యదు. అత్తగారు కంఠంలో ధ్వనులు మారినప్పుడు వంట గదిలోకి వెళ్ళి వో గిన్నో, చెంబో దొర్లించి, కూర బదులు చెయ్యి తరుక్కు గదిలోకి వెక్కుతూ రావటం కాంతానికి అలవాటైంది.

ఆరోజు శనివారం. గురునాధానికి కాలేజీవున్నా తనకి క్లాసుల్లేవని వెళ్ళినవాడు వో గంటలో తిరిగి వచ్చేశాడు. పెరటిగట్టుమీద కూర్చుని తల్లి సొకాలెడుతోంది. తలుపు వెనక నిల్చుని కాంతం వింతగా చూస్తోంది. పక్కింటి వెంకాయమ్మగారు నీళ్ళచెంబు చేతిలోంచి దింపకుండా చంద్రమ్మ గార్ని వోదారుస్తోంది.

చిట్టెక్క అన్నగారు రావటంచూసి కళ్ళు చిట్లిస్తూ "ఒరే అన్నో! ఇవాళేమొ వదినగారి పాండిత్యం బైటపడింది. మేము హడిలిపోయామనుకో. నాన్నకి వళ్ళు చచ్చుపడిందని వ్రాస్తే, అసలు నాన్నే ఐపోయినట్టు చదివిందిరా" అంటూ లెంపలేసుకుంటూ కాంతం కేసి కసిగా

చూసింది.

"అప్రాచ్చపు మాటలు అస్తమానం అనకూడదు. తదాస్తుదేవతలు వుంటారుట. ఆవిడని అల్లా పార్వతీదేవిలా బతకనివ్వండి" అంటూ వెంకాయమ్మగారు దీర్ఘాలుతీస్తోంది.

గురునాధం నలిగిన కార్డుని తిప్పితిప్పి చదువుకుని, 'వ్రాసినాయన సరిగ్గా వ్రాసి ఏడవక ఈ కలిపివ్రాత ఏమిటి నాకే అర్థంకావటంలేదు' అంటూ విసుక్కున్నాడు.

"ఇందా. విన్నావుగా; కుమారుడిగారి ఆదరణ ఎక్కడుందో" అంటూ దెప్పింది చిట్టెక్క. ఈసారి చంద్రమ్మ దుఃఖంతో వున్న మనస్సుకి పూనకం వచ్చినట్లయింది. గురునాధం ఇంటి పేరింటివాళ్ళు అంతా అంతేనంది. ఒఖ మీ తండ్రికి మాత్రము ఆ బుద్ధి రాకపోవటం తన ప్రారబ్ధమని నెత్తి కొట్టుకుంది. రాద్ధాంతంతగ్గి ఇంట్లో అంతా తలోమూల పీటచక్కల్లా కూర్చున్నారు. గురునాధం చేతిసంచీలో బట్టలేసుకు వూరికి బైలుదేరాడు.

చంద్రమ్మ రైలంత హోరుగావచ్చి సంచి దూరంగా గిరవాటెట్టి "నేనూ, నాపిల్లా వెడతాంలే నీకెందుకు ఆశ్రమ. నువ్వు బైలుదేరితే ఆవిడ పిల్లిలా వెంటపడదూ! వద్దులే నాయనా, అల్లా బతికుండనివ్వండి" అంటూ కాంతం కేసి వురుముతూ చూసింది. చిన్న కళ్ళల్లోంచి కోపం పూర్తిగా బయటపడలేదు.

రెండు రైళ్ళకి టైమ్ దాటేసిన తరవాత ఇల్లుకదిలారు తల్లీ కూతుళ్ళు. పనిమనిషి దగ్గర్నుండి నీళ్ళమనిషి దాకా ఎంత మోతాదుగా పనిచెయ్యాలో బోధించిమరీ ఎక్కింది చంద్రమ్మ బండీ. పక్కింటి వెంకాయమ్మగార్ని రోజూవచ్చి అజమాయిషీ చేసి వెళ్ళమని మరీమరీ చెప్పింది చిట్టెక్క.

గురునాధం వాళ్ళతో రైలు ఎక్కించేందుకు వెళ్ళాడు. తిరిగి వచ్చేసరికి చలికాలం పొగలాంటిది ఊరిని కమ్ముతోంది.

కాంతంలో కొత్తచైతన్యం పుట్టింది. వంటిల్లు భోజనాల గది చేసింది. గురునాధానికి ఇష్టమైన వేపుడుముక్కలు కరివేపాకు పచ్చడి లాంటివి కొన్ని తయారుచేసింది.

గురునాధం వివరాలు తెల్సుకోకుండా ఏదో అయిందని పించాడు. కాంతం మూతివిరుచుకుంది. ముభావంగా మాట్లాడింది. గురునాధం రెండురోజుల్లో ఇంటి వాతావరణానికి అలవాటు పడ్డాడు. కాంతం అత్తగారి హోదా తనకి వచ్చినందుకు లోపల తృప్తిగావున్నా పైకి చెప్పుకునేందుకు ఎవరున్నారు? వుసురుమంది. పనిమనిషి అత్తగార్ని పొగడటం చూసి అక్కర్లేదని పంపేసింది. ఆ సంగతి విన్నాక నీళ్ళమనిషి మాటల్లో జాగ్రత్తడింది.

వెంకాయమ్మగారిని చూసి కాంతం తలుపేసుకుంటోంది. గురునాధం తన వ్యాకరణాలు తిరగేసుకుంటూ మధ్య మధ్య కాంతంమాటలువింటూ కాలంతో రాజీపడుతున్నాడు.

తల్లి దగ్గరనుండి వరస తప్పకుండా కార్డులు వస్తూనే వున్నాయి. రెండు పంక్తుల్లో క్షేమాలు పూర్తిచేసి కార్డుని అద్దంలా అట్టేపెడుతుంది.

గురునాధానికి తండ్రివిషయం ఎందుకు వ్రాయదో అని వుత్తరం వచ్చినప్పుడల్లా విసుగు అనిపిస్తోంది. వోసారి వెళ్ళాలి అని హడావిడిచేసి, సర్దుకోవటం కార్డులు రావటమంత మామూలు ఐంది.

వెంకాయమ్మగారి ఇంట్లోకి గుమాస్తాగారు కాపరం వచ్చారు. పెరడు అంతా సందడిగా వుంటోంది. ఎప్పుడూ ఏవో మాటలు వినపడుతూనే వున్నాయి. కాంతానికి వెళ్ళి పలకరిద్దామని మనస్సులో వుండేది. మళ్ళా వెంకాయమ్మగారు అంటే వున్న బెరుకు వెళ్ళనిచ్చేది కాదు. ఏదో సూటీపోటీగా మాట్లాడుతుంది. ఆవిడ కేమి వరుగుతుందో తన్ని బాధ పెడితేనని తన అమాయకపు మొహం అద్దంలో చూసుకుంటూ జాలిపడి కరిగిన కాటికని కొంగుతో

తుడుచుకుంటూ గంటలు గడిపేది.

ఆరోజు గురునాధం పెందరాళే ఇంటికి వచ్చాడు. పెరటివేపునించి కొత్తకంఠాలు వినపడుతున్నాయి; ఆత్రుతగా పెరటిలోకి తొంగిచూశాడు.

గోడమీద కూర్చున్న అమ్మాయి పమిటకొంగు పళ్ళతో బిగించి ఆశ్చర్యంగా గురునాధం వేపు చూస్తూ కిందకి ఉరికి వెంకాయమ్మగారి పెరట్లోకి పరుగెట్టింది. రెండిళ్ళకి మధ్యలో దారికోసం గోడ పడగొట్టిన మొండి ఇటికలు, గొగ్గిపళ్ళల్లా వెక్కిరిస్తున్నట్టు బిగుసుకు వున్నాయి. పరుగెట్టి నమ్మాయి కొంగుని ఇటిక ముక్క పట్టుకుంది.

గురునాధం కేసి వోరగాచూస్తూ కొంగు విడిపించికొంటున్నట్లు తచ్చాడుతోంది. కాంతం ఇద్దరికీ మధ్యగావచ్చి "వుత్తరాలు ఏమైనా వచ్చాయా" అంటూ గురునాధాన్ని లోపలికి మళ్ళించి పెరటి తలుపు విసురుగా మూసుకుంది.

కాంతం లేనప్పుడు సందు కిటికీలోంచి ఆ అమ్మాయి తొంగిచూస్తుంది. గురునాధం తన కేసి చూసినపుడు సిగ్గుపడి నవ్వుకుంటూ పక్కకి తప్పుకుంటుంది.

యధాలాపంగా భోజనాలదగ్గర కాంతాన్ని "ఆ అమ్మాయి ఎవ"రని అడిగాడు.

ఏదో విసుగ్గా "కొత్తగావచ్చిన వాళ్ళ కోడలు" అని వూరుకుంది.

మరోరోజు ఎండవేళ యింటికి వచ్చాడు. తలుపులు మూసివున్నాయి. కాంతం నిద్దరోతే లేపటం కష్టమే. సందుతలుపు తెరుచుకు గది కిటికీలోంచి తొంగిచూశాడు. కాంతం ఆ అమ్మాయి తన మంచంపైన వళ్ళు తెలీకుండా నిద్దరోతున్నారు. అమ్మాయి నడుము కాంతంచేతిలో ఇరుక్కుంది. వత్తిగిల్లినవేపు పొట్ట తెల్లగా మెరుస్తోంది. కాంతంచెయ్యి చేగోడీవంపులా వుంది. గురునాధానికి ఆడవాళ్ళు అందునా పరాయివాళ్ళు అల్లా దగ్గరగాచూస్తే ముందు ఏమిటోలా అనిపించింది. తరవాత ఆశ్చర్యపడ్డాడు. ఎవరని అడిగినప్పుడే విసుక్కున్న కాంతాన్ని అమ్మాయి ఎల్లా మచ్చిక చేసుకుందో అర్ధంకాలేదు.

ఈ ముచ్చటేమిటో. కాంతానికి సిగ్గువుంటే ఇల్లా వుంటుందా? అడగాలి అనుకుంటూనే చిన్న మట్టిపెల్ల కిటికీలోంచి కాంతంపైకి విసిరాడు. కాంతం కదల్లేదు కాని అమ్మాయి కళ్ళు తెరచింది. తెరవటం కిటికీవెనక తనమీదే మొదటి చూపు నిలిపింది. ఆవలించింది. కాంతంచెయ్యి పక్కకి నెట్టింది. పమిట తీసి దులుపుకు వేసుకుంటూ మంచం దిగి అద్దందగ్గర చెరిగిన జుట్టుని సవరించుకుంటూ మెల్లిగా వో అర్ధగంట జరిపి వంటింటి గొళ్ళెం భళ్లున చప్పుడుచేస్తూ తెరచింది.

గురునాధానికి వళ్ళు మండుతోంది. తనింట్లో ఆవిడకి అంత స్వతంత్రమేమిటి? తన్ని చూసికూడా ఏమిటి ఆ తాత్సారం.. తనకి తలుపు తెరవాలని లేకపోతే కాంతాన్ని లేపవచ్చుగా; ఐనా అమ్మవెళ్ళాక కాంతానికి నిద్దరెక్కువైంది. అమ్మని రమ్మని వ్రాసి కాంతం తిక్క కుదర్చాలి అని మనస్సుని తేలికపర్చుకున్నాడు.

ఆ హంసగమన ఈపాటికి పెరడుదాటి వుంటుందన్న నమ్మకంతో వంటగదిలో అడుగుపెట్టి తలుపు గడియ పెట్టుకోబోయాడు.

"వుండండి, నన్ను వెళ్ళనివ్వండి" అంటూ తలుపు పక్కనించి ఆవిడ వయ్యారంగా దగ్గరగా వచ్చి చేతిని, ఘడియనీ కలిపి పట్టుకు వచ్చే నవ్వుని ఆపుకునేందుకు పెదిమని పంటితో బిగించింది.

అనుకోని సన్నిహితం అర్ధంకాక తెల్లబోయిన మనిషి తేరుకునే క్షణంలో, కళ్ళల్లోకి చూసి వెక్కిరింపుగా మూతి విరిచింది. గురునాధం చెయ్యి వెనక్కుతీసుకు దూరంగా జగరబోయాడు. వయ్యారంగా మీదకి తూలి, తలుపు తెరుచుకు పెరట్లోకి గెంతి, జాడీలపైనపడి

చుట్టూ చూసుకు తొంగిచూసే గురునాధాన్ని వెక్కిరిస్తూ వళ్ళు సవరించుకుని మొండిగోడ దాటి పక్కింటి పెరట్లోని అత్తగారి కంఠంతో మాటకలిపింది.

గురునాధం కంఠాల కలయిక్కి ఉలిక్కిపడి తలుపు ఘడియపెట్టి నలిగిన వేలుని వూదుకుంటూ గదిలోకిచేరాడు.

కాంతం వళ్ళువిరుపులు, ఆవలింతలూ ఐ ఎంతసేపు ఐందీ; వచ్చి? అని అడిగేందుకు పొద్దువాలింది. వంటింట్లో గిన్నెలు దొర్లటం, కిరసనాయిల్ కంపు, పాలవాడి అరుపులు' పెరడుచిమ్మే చప్పుడు - అన్నీ కలసి జోలపాటలా గురునాధాన్ని నిద్రపుచ్చాయి.

"ఈవేళప్పుడు నిద్రేమిటమ్మోవు; మీ ఆయనిది అంతా సొద్దెంగావుందే" కిటికీ అవతలనించి డబ్బాలోగవ్వల్లా కంఠము గలగల్లాడింది. మెలకువగా వున్నా కళ్ళు తెరవలేదు గురునాధం.

"మిమ్మల్నే" అంటూ కాంతం వేడిగ్లాసు పక్కనపెట్టి లేపింది.

కిటికీవూచల వెనక నిల్చి "కందిపచ్చడి తెస్తే నంచుకుంటారేమో అడగ రాదూ!' ' అని కాంతంతో అన్నా గురునాధంకేసి చూస్తోంది.

"ఈ అమ్మాయి ఎవరో తెలుసా; మీ చలపాయి లేడూ అతని మరదలేట. వాళ్ళ అక్కయ్య పెళ్ళికి మీరూ వెళ్ళారుటగా; నాకు చెప్పనేలేదే; పోనీ మీ అమ్మ వచ్చాక మిగిలిన ముచ్చట్లు చెప్పుకుందురు లెండి" అంటూ కాంతం మూతి ముడుచుకుని కార్డు మీదకి విసరింది.

తల్లి దస్తూరిచూసి గుండెలు వేగంగా కదిలాయి. కార్డు చిన్నదే కాని సంగతులు చాలా వున్నాయి. అక్షరాలు తెలీకుండా యిరికించకపోతే కవరు వ్రాయకూడదూ; అని విసుక్కుంటూ గురునాధం ముందుగదిలోకి వెళ్ళటం చూసి, కాంతంతో కలిసి కిచకిచలాడింది.

తల్లి ఉత్తరం ఈసారి ఎందుకో అంత నచ్చలేదు. మీ నాన్న యింకా లేచి తిరుగుతారన్న ఆశలేదు. ఈ కామాటం అంతా నేనే దిద్దుకోవాలి - అన్న మాటల్లో తల్లి వొడ్డూ పొడుగూ కనపడింది. వొవిధంగా తల్లికోరిక ఇన్నాళ్ళకి తీరిందేమో అనిపించింది. తల్లిపైన మళ్ళీ జాలేసింది. అవును వక్కకానీ చూసి ఎరగదు తండ్రిహయాంలో.

పాలేళ్ళు, పనివాళ్ళతో సమంగా గుడ్డలు కొని పడేసేవాడు. తనకి సుష్టుగా వుండాలి కనక వాళ్ళనీ ఇంత తిన నిచ్చాడు. అమ్మపడ్డ బాధలు కాంతాని కేమివున్నాయి. చిన్నతనంలో పెరటి తలుపులు తెరచుకు వానలో నానుతూ తల్లి కూర్చోవటం గుర్తుకి వచ్చింది. తాతయ్యకి తెల్సి హడావిడి చెయ్యటం, తండ్రి కోపంతో తల్లిని కొట్టటం కళ్ళలో మెదిలి మనస్సు ,చెమ్మగిల్లింది.

చివరిపంక్తిలో ఆ వూరు ఇప్పట్లో వదిలిపెట్టడం ఇష్టంలేదు అంటుందేమిటి?

అన్ని కవులుకిచ్చెయ్యొచ్చుగా! వోసారి వెళ్ళి అన్నీ నచ్చచెప్పి రావాలన్న తీర్పు చేసుకునేసరికి కాంతం వంట పూర్తిచేసుకు గుమ్మాన్ని అతుక్కు నిల్చుంది.

"ఓవారందాకా రాకపోవచ్చు, నువ్వుకూడా రాకూడదూ" అని కాంతాన్ని అడిగాడు.

"నే నెందుకులెండి! మీ అమ్మకి మీరు వక్కరూ రావటమే ఇష్టం. చూసి తొందరగా రాకూడదూ" అంటూ నసిగింది కాంతం.

గురునాధం బండిదిగి ఇంట్లోకి వెళ్ళినా తల్లి కంఠము వినపడలేదు. సింహంలాంటి తండ్రి మంచానికి అతుక్కుని పెరటివేపు పంచలో దుప్పటీకింద కదిలాడు.

చిట్టెక్క "ఎప్పుడు వచ్చావురా" అంటూ జామిచెట్టు దగ్గరనుండే కేకపెట్టింది.

నాన్న వచ్చీరాని మాటలతో తల్లిపైన చెపుతున్నాడు. తనతో తీసుకువెళ్ళమని

బతిమలాడుతున్నాడు. "మీ అమ్మ నన్ను చిత్రహింస పెడుతోంది. కానీ ఖర్చుచెయ్యటంలేదు -" అని చెప్పేందుకు చాలా ఆయాసపడ్డాడు. ఆమాటలు ఎందుకో జాలిపుట్టించలేదు.

తల్లిని వెతుక్కుంటూ మళ్ళీ పెరట్లోకి వెళ్ళాడు. పచ్చని చెట్లమధ్య నీరెండ దోబూచులాడుతోంది. పనసచెట్టు కింద నిల్చున్న అమ్మ వనదేవతలా మెరుస్తోంది. నీరెండలో చీరె అంచు మిలమిలా మెరుస్తోంది. మెరుపు తగ్గిన బంగారు నగలు బరువుగా కనపడ్డాయి. పలకరింపుగా అమ్మ నవ్వింది. చెట్టు అంత పొడుగునా నిల్చున్న మనిషిని పోల్చుకోలేక తేరిపారచూస్తూ పనసచెట్టువేంపు నడుస్తున్నాడు.

తెల్లటి ఖద్దరుబట్టలు, ఖద్దరుకండువా మెడచుట్టూ తిప్పుకుంటూ కళ్ళజోడులోంచి వురిమినట్లు గురునాధంకేసి చూశాడు.

అప్పటికి గుర్తు తెలిసింది నాన్నకి బద్ధశత్రువు పంతులు అని. బంధుత్వం దగ్గరైనా విరోధాలు చాలాదూరంచేశాయి. నలుపు విరిగి తెల్లబడ్డాడు. బాగా వళ్ళుచేసివేషం ఖద్దర్లోకి మార్చాడల్లేవుంది అనుకున్నాడు. అంతలోనే తల్లిమీద కోపం వచ్చింది. తండ్రి మంచాన పడితేమాత్రం ఏమిటో ఆ రాచకార్యాలు; ఇంట్లోనే మాట్లాడచ్చుగా. పెరట్లో ఎందుకో గురునాధానికి అర్థంకాలేదు.

"సరి, నేనువస్తా" అంటూ అమ్మకేసి అదోలా చూసి పెరడుదాటి పక్కసందులోంచి వెళ్ళిపోయాడు పంతులు.

చంద్రమ్మగారు గంభీరంగా మొహాన్ని మార్చుకు "ఏమిటి విశేషం?" అంటూ గురునాధాన్ని పలకరించింది.

ఎందుకో ఇదివరకంత చనువుగా తల్లితో మాట్లాడబుద్ధి పుట్టలేదు.

రాత్రి భోజనాలయ్యాక పెరటివసారాలో తల్లి తమలపాకులు వేసుకుంటూ కూర్చోవటం చూసి గురునాధం మొహం చిట్లించుకున్నాడు. తన బుద్ధెరిగి తల్లి అంత అందమైన బట్టలు కట్టడమే చూసి ఎరగడు. ఇంత తీరిగ్గా కూర్చుని ఆకులు నమలటం వూహించలేక బుల్లిబుఱ్ఱకి నెప్పి పట్టుకుంది.

వాకిట్లో గుర్రబ్బండీ ఆగిన చప్పుడుకిపడుకున్న చిట్టెక్క పరుగెట్టుకొచ్చింది. ఏం రావన్నా అంటూ బండీవాడిని పరామర్శించి అంత పరుగునా తల్లి దగ్గర వాలింది. "నాకు చెప్పలేదేమే, నేనూ రానా?" అని గారాం మొదలెట్టింది.

"అన్నకి పక్కా అదీ చూడు. మళ్ళీ వెళ్ళొచ్చులే" - అంటూ ఇనపెట్టె గదిలోకి వెళ్ళింది. తెల్లజరీచీర గూడకట్టు కట్టుకుంది. మొల్లో డబ్బు దోపుకున్నట్టు కనపడుతోంది. మొగలిపువ్వు వాసనలా నడుస్తూంటే గుప్‌మంది. "వాళ్ళ సీతలేదూ సినిమాకి రమ్మని బండి పంపింది" అంటూ తిరిగి చూడకుండా బండెక్కి వెళ్ళటం చూసి ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయాడు గురునాధం.

చిట్టెక్క నోరు సీమటపాకాయలా మంచీచెడూ ఏదో ఒకటి టపటపా అనడానికి అలవాటు పడింది. తీసుకెళ్ళలేదన్న అక్కసు మనస్సుని వూరుకోనివ్వలేదు. వదినగారిని మొదట దెప్పింది. మళ్ళీ తల్లిని తిట్టింది. "అదికాదురా; ఆ పంతులు గాడి నీడఅంటే గిట్టేదికాదు అమ్మకి. మరేం మందు జల్లాడో కాని, మొన్న ఎంత యిచ్చిందో చూడలేదు అనుకో అప్పిచ్చింది. దీనికి ఇప్పుడు సోకులు మప్పుతున్నాడ్రా. అనకూడదనుకో, రోజూ సినిమాలకో, నాటకాలకో బండిపంపి పిల్చుకు పోతున్నాడు. ఆ సీతలేదూ మొగుడు రమ్మన్నా వెళ్ళకుండా ఈ పంతులుగాడితోటే వుంటోంది తెలుసా?" అంటూ దవడలు నొక్కుకుంటూ ఇంకా చెపుతోంది. "అమ్మ కట్టుకున్న చీరలేదూ; ఆ సీతదే. మొన్న బోలెడు చీరలు మంచిమంచివి

పట్నంనించి తెచ్చాట్ట. సీత తెచ్చి అమ్మకి ఇస్తే సిగ్గులేకుండా ఇది పుచ్చుకోవడం చూడు. నేను ఊరుకోలేదు అనుకో, అడిగేశా. నన్ను నోరు ముయ్యమని తిట్టి డబ్బిచ్చి తెప్పించుకున్నానంటూ బుకాయించింది. నేను ఊరుకుంటానేమిటి? నాన్న ఎదుట పెట్టాను. దాంతో నాన్నకి జబ్బుమరీ ఎక్కువైంది. దీన్ని నీతో మీ ఊరు తీసుకుపోరా అన్నా. అన్ని తిక్కలూ అణుగుతాయి. నాన్నకి నేను వండిపెడతాలే" - అంటూ గుక్కతిప్పుకుంది చిట్టెక్క.

గురునాథం మెదడు తిమ్మిరెక్కినట్టయింది. మొద్దుబారిన మెదడుకి నిద్రపట్టింది.

తల్లిని మరోలా వూహించలేడు. చిట్టెక్క ఎటుఅంటే అటే వాగుతుందిలే అని సమాధాన పడ్డాడు. పొద్దున్నే తల్లిని చూడాలనిపించింది. పనివాళ్ళపైన అరుస్తూ తల్లే అటురావడం చూసి పక్కకి తిరిగి పడుకున్నాడు. తిరిగి వెళ్ళే తల్లిని ఓరగా చూశాడు. నలిగిపోయిన తెల్లజరీచీర వెగటుగా తోచింది.

కళ్ళు మూసుకునే "కాంతం రానీండి"

"భలేవారే" అంటూ కుర్చీని కుదిపింది. దీపం తీసేసి చూస్తోంది. చీకట్లో తెరచిన కళ్ళు వెల్తుర్లో అమ్మాయిమీద వాలింది చూపు. తెల్లజరీచీర, వదులుజడ వయ్యారంగా ముందుకీ వెనక్కీ వేసుకుంటోంది. మూతి తిప్పింది. కంటి రెప్పలు మూసితెరుస్తూ ఆడుకుంటోంది. చిలిపిపిల్లలాతోచింది. గురునాథం చూపులు చేతులకేసి తిప్పుకున్నాడు. "మీరు వెళ్ళండి, నేను తరవాత తింటా."

"చూస్తున్నా, ఏమిటా మొండితనం!" అంటూ చెయ్యి పుచ్చుకుంది.

గురునాథం నాడిఆగింది. మళ్ళీ వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. గుడ్లప్పచెప్పి చూస్తున్నాడు.

మూతి బిగించింది నవ్వు కనపడకుండా. హాల్లో దీపం తీసేసింది.

"అల్లా చిలిపిగా చూస్తే ఎల్లాగో సిగ్గేస్తుంది బాబు" అంటూ వయ్యారంగా తిప్పుకుంది.

కాంతం ఎప్పుడూ తన్ను పొగడలేదు. పైగా మీ అమ్మ గండుపోలికలు మాత్రం వచ్చాయి, అంటూ దెప్పుతుంది ఎప్పుడేనా!

"ఏమిటి అల్లా తలవంచుకున్నా రేమి!" అంటూ మొహం దగ్గరపెట్టి కళ్ళలోకి చూస్తోంది. "బుగ్గల్లో యేం దాచారు" అంటూ గిస్తోంది.

"తప్పు" అంటూ దూరంగా నెట్టిన చేతిని తీగలా చుట్టుకుంది. తెల్లచీరలో మొగలివాసన వదిలింది. చీకట్లో రొప్పుతూ ఏమిటో చెబుతోంది. గురునాథం కళ్ళని చేతుల్లో దాచింది.

మైనంబొమ్మలా మెత్తని వళ్ళు వెచ్చగా తగుల్తోంది. గురునాథం కుర్చీలోంచి దీపం వెయ్యబోయాడు. చేతిని పట్టుకుంది. వెచ్చటి కన్నీళ్ళు గురునాథం చేతిలో పడ్డాయి.

గురునాథం కరిగి జాలిగా మారి ఆమె కొంగులో మొహం దాచుకున్నాడు.

తెల్లచీర నలిగింది. దీపాల్లో మెరిసింది. తప్పని మనస్సు వప్పుకోలేదు ఆ అమ్మాయికి ఇష్టం. అంతే అని, మనస్సు గర్వపడింది.

వీధిలో బండి చప్పుడైంది. పెరటి తలుపు తెరచిన శబ్దం ఆగాయి చీకట్లో కిటికీదగ్గర నక్షత్రాల్లా ఆమె కళ్ళు మెరిశాయి.

సందుతలుపు దడదడ చప్పుడుచేస్తోంది కాంతం. వీధి తలుపు తెరవడం చూసి కాంతంమొహంలో సంతోషం కాగడాలా వెలిగింది. గడపదాటాక అనుమానం చీకటిలా వెంబడించింది. అప్పుడే వచ్చేశారేం; తాళాలు ఎవరిచ్చారు; పక్కింటివాళ్ళ అబ్బాయి వున్నాడా మీరు వచ్చేసరికి; ఈ గిన్నెలేమిటి; ఇంకేం భోజనంకూడా తెచ్చిపెట్టిందా ఏం?

ఆ అమ్మాయి వట్టి, ఛీ! ఏమో అనుకున్నా. మాటలు రాక ఆయాసపడుతోంది. ఇవాళ సినిమాలో సరస్వతి కనపడి చెప్పింది. వాళ్ళ పక్కవాటాలోనే వున్నారుట ఇదివరకు. వాళ్ళ ఆయన్ని వల్లో..." అంటూ గురునాథం కుర్చీదగ్గర కూర్చుని కళ్ళలోకి చూస్తోంది పరీక్షగా. గురునాథం కళ్ళు కాంతాన్ని తప్పించుకు చీకట్లోకి చూస్తున్నాయి. గురునాథం చుట్టూవున్న వాతావరణంలో జాజిపూలు నలిగినవి. దిగులుగా చూస్తున్నాయి. కాంతం మాటలు కంటినీటితో కలసి కఠినంగా గురునాథాన్ని గుచ్చుకున్నాయి. అలిసి విసిగిన ప్రాణికి కుర్చీలోనే నిద్రపట్టింది.

తెల్లవారింది. మాలకాకి మామూలుగా దణ్ణెంపైన బొంగురుగొంతుతో అరుస్తోంది. నలిగిన తెల్లజరిచీరకి కాటిక పులుముకుని వాచిన రెప్పలకింద కళ తప్పిన కళ్ళని దాచుకుంటూ, కాంతం పెరట్లోకి వెళ్ళటం చూసి, కాంతాన్ని ఎప్పుడూ ఈ చీరలో చూడగూడదని మనస్సులోనే తీర్పుచేసుకున్నాడు గురునాథం.

కాంతం కదలిక గాలివాన ఉధృతంలా ఇల్లంతా ఫెళ ఫెళ్ళాడింది. కాలం జరిగి సంధ్యవేళకి కొంత సర్దుకుంది. సందుతలుపులు బిగిశాయి. కిటికీరెక్కలు గడియపెట్టి, పెరటి తలుపుకి తాళంపెట్టుకు వీధి కటకటాలని అతుక్కు నిల్చుని గురునాదం రాకకోసం చూపులు వీధిమలుపుదగ్గర నిల్చాయి.

గురునాథం పరధ్యానంగా లోపల అడుగుపెట్టాడు. చేతిలో పొట్లం మంచం పైకి విసిరి గోడకేసిచూస్తూ "వరలక్ష్మి పంపింది" అని తుంచినట్లు చెప్పాడు.

కాంతం ఆతృత చూపకుండా పొట్లంవిప్పింది. చీరని తిప్పింది. "ఇంత జరీది నేను అడగలేదు" అంటూ మూతివిరిచింది. పాముకూసంలా పల్చటిచీర. అరచేతి వెడల్పు చుట్టూజరీ బంగారంలా మెరిసిపోతోంది. ధర కొంగుకి కట్టివుంది.

అద్దంముందు నిల్చుని పైన వేసుకు చూసుకుంది. మనస్సులో దిగులుగా వుంది. చీరకూడా దిగులుగా కనపడింది. మడతలు తిప్పింది, మళ్ళీ పెట్టింది. అక్కడేపెట్టి వంటింటిలోకి వెళ్ళింది.

గురునాథం ఆ చీరలో పక్కింటి అమ్మాయిని ఊహించాడు. పోనీ కాంతం ఇస్తే, అక్కడితో ఆ ఊహకి హద్దు ఏర్పడింది. గదిలో కాంతం తచ్చాడుతోంది. ఏదో మాట్లాడాలి. పొడికంఠంతో "కట్టుకు చూడరాదూ! అన్నిసార్లు తిప్పిచూస్తే ఏం తెలు స్తుంది."

మాటలు కలిపినా మనస్సులు చెట్టు చివరని చెరో వేంపు చూస్తున్నాయి.

కాంతం తల్లి వచ్చింది. ఆరోజు ఇంట్లో నిశ్శబ్దం విడచి సందడి వినపడింది. గురునాథం వచ్చేవేళకి కాంతం కొత్తచీర పువ్వులజడతో అద్దంముందు నిల్చుని చీరమడతలు సర్దుకుంటోంది.

కాంతం నవ్వింది. గురునాథం మౌనం విడచి "చీర కట్టుకుంటే బాగుంది కదూ!" జీరాడే కుచ్చెళ్ళని చూస్తూ ఆ అమ్మాయికి ఈ చీర వూహించాడు. ఊహల్ని కళ్ళెం వేసిన గుఱ్ఱంలా ఆపి, కాంతంపై జాలిపడి, మంచితనానికి హద్దులు పెంచాడు.

కాంతం గురునాథం వూహల్ని భావాల్ని చదవగల తెలివివున్నా అమాయకంగా మురిసినట్టు నవ్వుకుంటూ తల్లి దగ్గరకు వెళ్ళబోయింది. చీరకొంగు గురునాథంచేతిలో చిక్కింది.

✧